


# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

గురువారం । 22 । అక్టోబర్ । 2026 పేజీలు: 9


# పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్పీ రాజేష్ చంద్ర.
- కామారెడ్డి జిల్లా నుంచి ఏడుగురు పోలీసుల ప్రాణత్యాగం, కుటుంబాలకు అండగా ఉంటాం.
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా నివాళులు.
- ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం.
- అమరవీరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

2

కామారెడ్డి, అక్టోబర్ 21 (మనం బ్యూరో): దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అన్నారు. అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు.





## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- సమ్మెకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మద్దతు...
- క్యాడర్ ఫిక్సేషన్‌తో పాటు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి...
- ఉద్యోగ భద్రత, ఈహెచ్‌ఎస్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి...

3

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి



- ఐదేళ్ల విరామానికి తెర..షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా!
- కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని పిలుపు.
- కామారెడ్డిలో 36 ఏళ్ల దసరా ఉత్సవాల సంప్రదాయానికి అండగా షబ్బీర్ అలీ ఫౌండేషన్.

2

కామారెడ్డి, అక్టోబరు 21 (మనం న్యూస్): ఐదేళ్ల విరామం తర్వాత కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలకు మళ్లీ వైభవం సంతరించుకుంది. షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి







- వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్పీ రాజేష్ చంద్ర.
- కామారెడ్డి జిల్లా నుంచి ఏడుగురు పోలీసుల ప్రాణత్యాగం, కుటుంబాలకు అండగా ఉంటాం.
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా నివాళులు.
- ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం.
- అమరవీరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

కామారెడ్డి, అక్టోబర్ 21 (మనం బ్యూరో): దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అన్నారు. అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత.

ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ., 1959 అక్టోబరు 21న లడఖ్లోని అక్సాయిచిన్ ప్రాంతంలో చైనా దళాల దాడిలో పది మంది కేంద్ర రిజర్వ్ పోలీసు దళ సిబ్బంది వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం, రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులను ఎదుర్కొంటూ 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు అమరులయ్యారని తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, అమరవీరుల స్ఫూర్తితో కర్తవ్య నిర్వహణలో ముందుకు సాగాలని సూచించారు.

## అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., విధి నిర్వహణలో అమరులైన పోలీసుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరాలంటే శాంతిభద్రతలు కీలకమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, అంతర్గత భద్రతలో పోలీసులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ ప్రజల రక్షణకు అంకితమవుతున్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన కలెక్టర్., వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా తనను కలవవచ్చని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు శాఖ కూడా అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి: షబ్బీర్ అలీ

- ఐదేళ్ల విరామానికి తెర..షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా!
- కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని పిలుపు.
- కామారెడ్డిలో 36 ఏళ్ల దసరా ఉత్సవాల సంప్రదాయానికి అండగా షబ్బీర్ అలీ ఫౌండేషన్.





కామారెడ్డి, అక్టోబరు 21 (మనం న్యూస్): ఐదేళ్ల విరామం తర్వాత కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలకు మళ్లీ వైభవం సంతరించుకుంది. షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల మధ్య మతసామరస్యం, సోదరభావం, ఐక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

## 36 ఏళ్ల సంప్రదాయానికి మళ్లీ ఊపిరి

కామారెడ్డి పట్టణంలో దాదాపు 36 ఏళ్లుగా షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు నిర్వహిస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రజలందరూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపై కలుసుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ప్రభావం, ఇతర పరిస్థితుల కారణంగా గత ఐదేళ్లుగా ఉత్సవాలను నిర్వహించలేకపోయామని చెప్పారు. ఇన్నాళ్ల విరామం తర్వాత మళ్లీ ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, సహకారం ఈ కార్యక్రమాల నిర్వహణకు ప్రధాన బలమని పేర్కొన్నారు.

## ప్రజల ఐక్యతే లక్ష్యంగా ఉత్సవాల పునఃప్రారంభం

దసరా వేడుకలను కేవలం పండుగ సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజంలో ఐక్యతను చాటే వేదికగా నిర్వహించాలన్నదే తమ ఉద్దేశమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. పండుగలు ప్రజలను దగ్గర చేస్తాయని, పరస్పర గౌరవం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన గంగా జమునా తెహజీబ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం సమాజానికి గర్వకారణమని వివరించారు.

## చెడుపై మంచి విజయమే విజయదశమి

విజయదశమి చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని షబ్బీర్ అలీ అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, విశ్వాసం, న్యాయం పట్ల నిబద్ధతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి

విజయదశమి సందర్భంగా అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



కామారెడ్డి పట్టణ ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తూ మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఐక్యత, మతసామరస్యం, సంప్రదాయ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఐదేళ్ల విరామం తర్వాత నిర్వహించిన ఈ విజయదశమి వేడుకలు కామారెడ్డిలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

**సమ్మెకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మద్దతు...**

**క్యాడర్ ఫిక్సేషన్తో పాటు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి...**

**ఉద్యోగ భద్రత, ఈహెచ్ఎస్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి...**



ఆర్మూర్ : నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్లో ఎన్హెచ్ఎం ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఉద్యోగులకు న్యాయం చేయాలి.,**

ఆరోగ్య రంగంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్హెచ్ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వారి డిమాండ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**క్యాడర్ ఫిక్సేషన్, 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలి.,**

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఉద్యోగికి క్యాడర్ ఫిక్సేషన్ అమలు చేయడంతో పాటు, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగుల వేతనాలు, సర్వీసు సంబంధిత అంశాల్లో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం లభించేలా సంబంధిత అధికారులు స్పందించాలని సూచించారు.

**ఉద్యోగ భద్రతతో పాటు ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలి.,**

ఎన్హెచ్ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, ఈహెచ్ఎస్ (ఉఏఖ), ఈఎస్ఐ (ఉఖఐ) వంటి ఆరోగ్య భద్రతా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు వైద్యపరమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

**డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి**

ఎన్హెచ్ఎం ఉద్యోగులు తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే, వారి డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను జాప్యం చేయకుండా పరిష్కరించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు...



## ఐటీ రంగంలో యువత రాణించాలి: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**నిజామాబాద్ ఐటీ టవర్లో సాంకేతిక సంస్థ ప్రారంభం**



నిజామాబాద్ రూరల్ , అక్టోబర్ 21 (మనం న్యూస్): యువత నూతన ఆవిష్కరణలతో ఐటీ రంగంలో రాణించి, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ ఐటీ టవర్లో డిచ్పల్లి మండలానికి చెందిన సాయిలు కుమారుడు సాయి తేజ ఏర్పాటు చేసిన ఎస్వీఏజీఎస్ టెక్నాలజీస్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లో ఐటీ సంస్థలు ఏర్పాటైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్ల సర్వీసులకు సంబంధించి ప్రత్యేక అనువర్తనాన్ని అభివృద్ధి చేసిన సంస్థ నిర్వాహకుడు సాయి తేజను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

**అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం.. కారుణ్య నియామకాలను వేగవంతం చేస్తాం**

**కలెక్టర్ ఇలా త్రిపాఠి సిపి సాయి చైతన్య**







నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నిజామాబాద్ పోలీస్ హెడ్క్వార్టర్స్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటాయని, కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ.. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుంచి ఇప్పటివరకు 21 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. ఇప్పటికే 11 మంది అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించామని, మిగిలిన కుటుంబాలకు స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అమరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామని, పోలీసు అధికారులు వారి అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.





# అమరవీరుల సంస్మరణ దినోత్సవం.. పోలీసుల అవగాహన

**- హెల్మెట్ ధరించాలి, మైనర్ డ్రైవింగ్కు దూరంగా ఉండాలి. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన.**

**- అత్యవసర సాయం కోసం 112కు ఫోన్ చేయాలి: పోలీస్ కళాబృందం రామంచ తిరుపతి.**



కామారెడ్డి, అక్టోబరు 21 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బస్టాండ్ ఆవరణలో బుధవారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాటలు, మాటల ద్వారా ప్రయాణికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాల బాధితులు వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన సమాచారం కోసం 1908 నంబరును వినియోగించుకోవాలని తెలిపారు. షీ టీమ్ సేవలకు 8712686094 అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేయాలని, మహిళల రక్షణకు షీ టీమ్స్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. షీ టీమ్ సేవల కోసం 8712686094 నంబరును సంప్రదించవచ్చన్నారు. దొంగతనాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, కానిస్టేబుళ్లు యు.శేషారావు, ప్రభాకర్, సాయిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. షీ టీమ్ మహిళా కానిస్టేబుల్ సౌజన్య, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు హాజరయ్యారు.



## బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్కు దసరా శుభాకాంక్షలు

**జమ్మి ఆకులు అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపిన సిరికొండ బీఆర్ఎస్ నాయకులు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): నిజామాబాద్లో తెలంగాణ ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాజిరెడ్డి జగన్ను సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జమ్మి ఆకులు అందించి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దువ్వూరు సంతోష్ రెడ్డి, మండల మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు అన్సారి, హుస్సేన్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు తీనేటి నర్సారెడ్డి పాల్గొన్నారు.

## దసరా రోజున క్యాన్సర్ బాధితుడికి తెల్ల రక్త కణాల దానం

**- పండుగ రోజున స్పందించిన రక్తదాతను అభినందించిన ఐవీఎఫ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు**

కామారెడ్డి, అక్టోబరు 21 (మనం న్యూస్): దసరా పండుగ రోజున క్యాన్సర్ బాధితుడికి అత్యవసరంగా తెల్ల రక్త కణాలను అందజేసి లక్కబత్తిని రవికుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన ఆయన 44వసారి రక్తదానం చేసి ఆపదలో ఉన్న రోగికి అండగా నిలిచారు. ఎల్లంపేట గ్రామానికి చెందిన చిన్న రాజయ్య (45) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కామారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అత్యవసరంగా ఏ పాజిటివ్ తెల్ల రక్త కణాలు అవసరమని వైద్యులు సూచించారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్క్రాస్ జిల్లా సమన్వయ సభ్యుడు డాక్టర్ బాలు ను సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి రవికుమార్కు సమాచారం అందించారు. దీంతో రవికుమార్ తక్షణమే స్పందించి తెల్ల రక్త కణాలను అందజేశారు.

**44వసారి రక్తదానం చేసిన రవికుమార్**

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. దసరా పండుగను కుటుంబ సభ్యులతో గడిపే సమయంలోనూ




బాధితుడి అవసరాన్ని గుర్తించి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఎలాంటి సంబంధం లేకపోయినా రక్తబంధంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు ముందుకొచ్చే రక్తదాతలు నిస్వార్థ సేవకులని పేర్కొన్నారు. వారి సేవలను సమాజం గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. 44వసారి రక్తదానం చేసిన రవికుమార్ను అభినందించారు.



## ఎమ్మెల్యే భూపతి రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణుల

**క్యాంపు కార్యాలయంలో సందడి చేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ రూరల్, మోపాల్, డిచ్పల్లి, జక్రాన్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల రాకతో క్యాంపు కార్యాలయంలో పండుగ సందడి నెలకొంది.



## డీఎస్పీగా నిఖిల రెడ్డి ఎంపిక జిల్లాకు గర్వకారణం: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**గ్రూప్-1లో ప్రతిభ చాటిన నిఖిల రెడ్డికి ఘన సత్కారం**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన గౌరోల్లా నిఖిల రెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న నిఖిల రెడ్డి యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

నిజామాబాద్ నగరంలోని గంగస్థాన్-2, డివిజన్ నంబర్ 3కు చెందిన గౌరోల్లా చంద్రకళ, భూమ్ రెడ్డి దంపతుల కుమార్తె నిఖిల రెడ్డి డీఎస్పీ ఉద్యోగం సాధించిన సందర్భంగా బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిఖిల రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు.



ఈ సందర్భంగా భూపతి రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు విద్యలో రాణిస్తూ ఉన్నత పదవులను సాధించడం ఎంతో సంతోషకరమన్నారు. నిఖిల రెడ్డి భవిష్యత్తులో విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలకు సేవలందించాలని, తన ప్రతిభతో జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమె విజయానికి సహకరించిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మాతా దేవి నిమజ్జన మహోత్సవం

**అంగరంగ వైభవంగా అమ్మవారి శోభాయాత్ర.. భక్తిశ్రద్ధలతో వీడ్కోలు...**

**తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న అమ్మవారు నిమజ్జనానికి పయనం...**

**జై మాతా దీ నినాదాలతో మార్మోగిన వీధులు...**

**వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ భక్తుల ప్రార్థనలు...**



రెంజల్ అక్టోబర్ 21 (మనం న్యూస్ ): తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు, అర్చనలు, హారతులతో విశేషంగా కొలువుదీరిన మాతా దేవి నిమజ్జనానికి పయనమయ్యారు. అమ్మవారి నిమజ్జన మహోత్సవం భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక సందడి మధ్య అంగరంగ వైభవంగా కొనసాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం భక్తిభావంతో పులకించిపోయింది.

**భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర.. జై మాతా దీ నినాదాలతో హోరెత్తిన సందడి.,**

అమ్మవారి నిమజ్జనాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శోభాయాత్ర అట్టహాసంగా సాగింది. భక్తులు అమ్మవారిని భక్తిపారవశ్యంతో కొలుస్తూ, జై మాతా దీ అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో పూజలు, ప్రార్థనలతో గడిపిన భక్తులు నిమజ్జన వేళ భావోద్వేగానికి లోనయ్యారు. అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు.



**మళ్లీ వచ్చే ఏడాది రావమ్మా.. భక్తుల హృదయాల్లో భక్తిభావం.,,**

తొమ్మిది రోజుల పాటు తమకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించిన అమ్మవారికి భక్తులు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. నిమజ్జన ఘట్టం ముగుస్తున్న వేళ అమ్మవారిని సాగనంపుతూ, వచ్చే ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవారి నామస్మరణతో మార్మోగిన శోభాయాత్ర భక్తుల్లో చెరగని ముద్ర వేసింది.

భక్తి, విశ్వాసం, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మాతా దేవి నిమజ్జన మహోత్సవం భక్తుల మనసుల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయింది.

జై మాతా దీ!...

---

# బాగేపల్లిలో అంబరాన్నంటిన మాత శోభాయాత్ర సంబరాలు



**అంబుల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమైన అమ్మవారి శోభాయాత్ర...**

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామ సర్పంచ్ సవిత-నరేష్, యువత, మహిళలు...**

**అమ్మవారి నామస్మరణతో మార్మోగిన గ్రామ వీధులు.. పండుగ వాతావరణంలో బాగేపల్లి...**

రెంజల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని బాగేపల్లి గ్రామంలో మాత అమ్మవారి శోభాయాత్ర అంబుల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి పట్ల భక్తిశ్రద్ధలను చాటుతూ నిర్వహించిన ఈ శోభాయాత్ర గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

**వైభవంగా ప్రారంభమైన అమ్మవారి శోభాయాత్ర.,**

అంబుల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన మాత శోభాయాత్రలో గ్రామానికి చెందిన యువత, మహిళలు, గ్రామ పెద్దలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకుంటూ శోభాయాత్రలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో శోభాయాత్ర ప్రారంభం కావడంతో గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.

**శోభాయాత్రలో పాల్గొన్న సర్పంచ్ సవిత-నరేష్.,**

ఈ కార్యక్రమంలో బాగేపల్లి గ్రామ సర్పంచ్ సవిత-నరేష్ పాల్గొని శోభాయాత్రలో భాగస్వాములయ్యారు. గ్రామస్థులు, యువత, మహిళలు, పెద్దలు, పిల్లలు కలిసి పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా మతపరమైన, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

**భక్తి భావంతో ఒక్కటైన గ్రామ ప్రజలు.,**

మాత అమ్మవారి శోభాయాత్ర సందర్భంగా గ్రామస్థులు భక్తి భావంతో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యువత ఉత్సాహం, మహిళల భాగస్వామ్యం, గ్రామ పెద్దల హాజరు, చిన్నారుల సందడి కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియగా, అమ్మవారి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామస్థులు భాగస్వాములయ్యారు.

**గ్రామ ఐక్యతకు ప్రతీకగా మాత శోభాయాత్ర.,**

బాగేపల్లి గ్రామంలో నిర్వహించిన మాత శోభాయాత్ర గ్రామ ప్రజల ఐక్యతను, భక్తి విశ్వాసాలను చాటిచెప్పింది. అంబుల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవిత-నరేష్తో పాటు యువత, మహిళలు, గ్రామ పెద్దలు, చిన్నారులు పాల్గొని శోభాయాత్రకు తమ వంతు సహకారం అందించారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో మాత శోభాయాత్ర సందడిగా ప్రారంభమైంది...

---

# జెండా ఊపి దేవీ నిమజ్జనాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ సీమా షెట్కార్





బిచ్కుంద అక్టోబర్ 21 ( మనం న్యూస్): దేవీ నవరాత్రుల ఉత్సవాల ఊరేగింపు సందర్భంగా ఈరోజు బిచ్కుంద మండల కేంద్రంలో బిచ్కుంద మున్సిపల్ చైర్మన్ సీమా సేట్ కార్ జెండా ఊపి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ మాట్లాడుతూ దుర్గా మాతాని ఆదర్శంగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సార్వజని ఉత్సవ సమితి అధ్యక్షులు రామ్ కిషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తుని ఏర్పాటు చేశారు.

---

# దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

**కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి.. ఉపాధి అవకాశాలు కల్పించాలి**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్ను నెలకు రూ.6,000కు పెంచడంతో పాటు అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని దివ్యాంగ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నకిలీ దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన డాక్టర్ సుమన్ నేతృత్వంలోని దివ్యాంగ సంఘాల ప్రతినిధుల బృందం శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, ఐఏఎస్ను కలిసి వినతిపత్రం సమర్పించింది. దివ్యాంగులు ఎదుర్కొంటున్న పెన్షన్లు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై సానుకూలంగా స్పందించిన దివ్య దేవరాజన్, దివ్యాంగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సంఘాల నాయకులు తెలిపారు. దివ్యాంగుల ఆర్థిక భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# సిరికొండలో ఘనంగా దసరా వేడుకలు







## షమ్మీ చెట్టుకు పూజలు.. ఒకరినొకరు షమ్మీ పెట్టుకుంటూ అలయ్ బలయ్

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 20 (మనం న్యూస్): సిరికొండ మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జమ్మిచెట్టు వద్ద శ్రీకాంత్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం జమ్మి ఆకులను సేకరించి గ్రామస్థులు ఒకరినొకరు జమ్మి పెట్టుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ పరస్పరం జమ్మి ఆకులు ఇచ్చిపుచ్చుకుంటూ అలయ్ బలయ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయదశమి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడిసి చైర్మన్ దేగం సాయన్న, వైస్ చైర్మన్ పారిపల్లి శివ రెడ్డి,



క్యాషియర్ అంగూరి రాజ గణేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చిట్యాల రాజన్న, రైటర్ మాద నర్సింగరావు, సలహాదారులు తాళ్ల శ్రీనివాస్ గ్యామ దాస్, కనగందుల నవీన్, ఆవదూత శోభన్, మీసాల ప్రవీణ్, బందెల రాజు, కట్టాజి రవి, చాకలి రాజన్న, కాసుల గంగారాం, పంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు ఆనంద ఉత్సవాల్లో పాల్గొన్నారు.



# ఆర్మూర్ దసరా వేడుకలకు తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు

## భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా దుర్గామాత ఉత్సవాలు

ఆర్మూర్, అక్టోబర్ 21 (మనం న్యూస్): ఆర్మూర్ దసరా వేడుకలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రత్యేక గుర్తింపు పొందాయని వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నాయకులు పేర్కొన్నారు. ఆర్మూర్లోని జంభిహనుమాన్ దుర్గామాత ఆలయం వద్ద తొమ్మిది రోజులుగా నిర్వహించిన పూజలు, అమ్మవారి అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు.దసరా వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులకు, పోలీస్ శాఖ అధికారులకు, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్మూర్ దసరా ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడం విశేషమన్నారు.ఇలాంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు హిందూ ధర్మ గొప్పతనాన్ని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు. ధర్మం ఉన్నచోటే విజయం ఉంటుందనే సందేశాన్ని విజయదశమి చాటిచెబుతుందన్నారు.

జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు ఆర్మూర్ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మెన్ గోనె లహరి రఘు మార్కెట్ కమిటీ చైర్మెన్ సాయిబాబా, గౌడ్, ఆలయ కమిటీ చైర్మెన్ కౌన్సిలర్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కామారెడ్డి టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా గైని శ్రీనివాస్ గౌడ్

- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) సోషల్ మీడియా ప్రెసిడెంట్గా జొన్నల వినోద్కుమార్.
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత.
- జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి, పంచజన్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

కామారెడ్డి, అక్టోబరు 21 (మనం న్యూస్): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గైని శ్రీనివాస్ గౌడ్, జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంట్గా జొన్నల వినోద్కుమార్ నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత వీరి నియామకాలను అధికారికంగా ప్రకటించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే దిశగా పనిచేయాలని ఆమె సూచించారు.

### పంచజన్య పథకాలను గడపగడపకు

గైని శ్రీనివాస్ గౌడ్ గతంలో అందించిన సేవలను గుర్తించి ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ పంచజన్య పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలని కవిత సూచించారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన కవితకు శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, జిల్లాలో పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



### 13 ఏళ్లుగా కవిత నాయకత్వంలో వినోద్కుమార్

కామారెడ్డి జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంట్గా రాజంపేట మండల కేంద్రానికి చెందిన జొన్నల వినోద్కుమార్ను నియమించారు. ఆయన గత 13 సంవత్సరాలుగా జాగృతి, టీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో కవిత నాయకత్వంలో పనిచేస్తున్నారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన కవితకు వినోద్కుమార్



హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంతోపాటు ఎల్లారెడ్డి నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్చార్జి సంపత్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గైని శ్రీనివాస్ గౌడ్లతో సమన్వయం చేసుకుంటూ జిల్లా పార్టీ బలోపేతానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని వినోద్కుమార్ వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా పార్టీ కార్యక్రమాలు, విధానాలు, నాయకుల సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# 13 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన సత్యశోధక్ పూర్వ విద్యార్థులు

## గురువులకు ఘన సన్మానం.. పాత జ్ఞాపకాలతో సందడిగా ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): చదువుకున్న పాఠశాల.. నేర్పిన గురువులు.. కలకాలం గుర్తుండిపోయే స్నేహాలు.. ఇలా పాత జ్ఞాపకాల నడుమ సత్యశోధక్ పాఠశాల 2012-13 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం సిరికొండలోని ఎం.ఎస్. ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత మిత్రులంతా ఒకేచోట కలుసుకోవడంతో వేడుక సందడిగా సాగింది.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల అనుభవాలను గుర్తుచేసుకుంటూ, ప్రస్తుత జీవిత విశేషాలను పరస్పరం పంచుకున్నారు. తమకు



విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి, ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్యతో పాటు ఉపాధ్యాయులు గంగారెడ్డి, సంతోష్ రెడ్డి, లింగం, నరేందర్, మైఖేల్, ప్రసాద్, అరుణ, సుజాతలను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలే పునాదులని అన్నారు. పాఠశాల యూనిఫాం విడిచినా గురు-శిష్యుల అనుబంధం ఎప్పటికీ చెరిగిపోదని పేర్కొన్నారు. పాఠశాల రోజుల్లో ఏర్పడిన స్నేహాలను జీవితాంతం కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ రంగాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సైతం తమ పూర్వ విద్యార్థులను తిరిగి కలుసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొంటూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. పాత స్నేహాలు, గురువుల ఆశీస్సులు, మధుర జ్ఞాపకాలతో ఈ ఆత్మీయ సమ్మేళనం అందరిలో ఆనందాన్ని నింపింది.

# పూల పండుగకు ముగింపు వేళ..

**సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా ముగింపు..**

**ప్రకృతిని పూజిస్తూ.. ఆడపడుచుల ఆనందాన్ని చాటుతూ.. చెరువుల వైపు సాగిన బతుకమ్మలు**



మెండోరా, అక్టోబర్ 21 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ముగింపు నేటితో చేరుకుంది. తొమ్మిది రోజుల పాటు పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో, కోలాటాలతో, సామూహిక వేడుకలతో ఆనందంగా జరుపుకున్న ఆడపడుచులు.. నేడు బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువులు, కుంటల వైపు బయలుదేరారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా బతుకమ్మ పాటలు, పండుగ సందడి, మహిళల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ**

బతుకమ్మ అంటే కేవలం పూలతో పేర్చిన పండుగ మాత్రమే కాదు.. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రకరకాల పూలతో బతుకమ్మను అలంకరించి, ప్రకృతిలోని అందాన్ని, జీవన వైభవాన్ని చాటుకుంటారు. మహిళల ఐక్యతకు, కుటుంబాల సంతోషానికి, తెలంగాణ ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుంది.

**సంప్రదాయాన్ని కాపాడుతూ.. ప్రకృతిని పరిరక్షిద్దాం**

బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తను వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. సహజసిద్ధమైన పూలతో పండుగను జరుపుకుంటూ, నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత. పండుగ ఆనందం ప్రకృతికి హాని కలిగించకుండా ఉండాలి.

**బతుకమ్మ వెళ్లిపోతుంది.. జ్ఞాపకాలు మిగిలిపోతాయి!**

తొమ్మిది రోజుల సంబరాలకు ముగింపు పలుకుతూ బతుకమ్మలు నిమజ్జనానికి బయలుదేరినా.. అవి చాటిన ఐక్యత, ఆప్యాయత, ప్రకృతి ప్రేమ మన హృదయాల్లో చిరస్థాయిగా నిలవాలి. మన సంస్కృతిని భావితరాలకు అందించడం, ప్రకృతిని కాపాడటం, ఆడపడుచుల ఆనందాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.

పండుగ ముగిసినా.. ప్రకృతిని ప్రేమించే మన సంప్రదాయం నిరంతరం కొనసాగాలి. ఇదే బతుకమ్మ ఇచ్చే గొప్ప సందేశం!

# అమ్మవారి లక్కీ డ్రాలో స్కూటీ గెలుచుకున్న మెట్టు లాస్య

**రెంజల్ లో అదృష్టాన్ని వరించిన లక్కీ డ్రా.. విజేతగా నిలిచిన మెట్టు రంజిత్ కుమార్తె...**

**అమ్మవారి లక్కీ డ్రాలో స్కూటీ సొంతం చేసుకున్న లాస్య.,**

**విజేతగా నిలవడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందోత్సాహాలు.,**



రెంజల్, అక్టోబర్ 21 (మనం న్యూస్):రెంజల్ మండలంలకేంద్రం లో గ్రామంలో అమ్మవారి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో మెట్టు లాస్య స్కూటీని గెలుపొందింది. మెట్టు రంజిత్ కుమార్తె అయిన లాస్య లక్కీ డ్రాలో విజేతగా నిలవడంతో కుటుంబ సభ్యులు, పరిచయస్తుల్లో ఆనందం వెల్లివిరిసింది.

**అమ్మవారి లక్కీ డ్రాలో అదృష్ట విజయం.,**

రెంజల్ మండల కేంద్రం లో అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన లక్కీ డ్రాలో స్కూటీ బహుమతిని మెట్టు లాస్య గెలుచుకుంది. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ లక్కీ డ్రాలో ఆమె విజేతగా నిలవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్కూటీ గెలుచుకున్న విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

**లాస్యకు దక్కిన అదృష్ట బహుమతి.,**

అమ్మవారి ఉత్సవాల సందర్భంగా లక్కీ డ్రాలో స్కూటీని గెలుచుకోవడంతో మెట్టు లాస్య పేరు గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఉత్సవాల సందడి మధ్య లక్కీ డ్రా విజేతగా నిలవడం ఆమెకు మధుర జ్ఞాపకంగా నిలిచిపోనుంది. ఈ సందర్భంగా మెట్టు రంజిత్ కుటుంబంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

రెంజల్ లో అమ్మవారి ఉత్సవాల్లో లక్కీ డ్రా ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, స్కూటీ విజేతగా మెట్టు లాస్య నిలవడం విశేషంగా మారింది...



## దివ్యాంగులపై దాడులు, వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి

**దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.. డీజీపీకి వినతి**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): దివ్యాంగులపై దాడులు, అవమానాలు, వివక్షకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దివ్యాంగ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సుమన్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016లోని సెక్షన్ 92ను సమర్థవంతంగా అమలు చేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ మేరకు టీపీసీసీ సీనియర్ నాయకుడు ఘంటా సత్యనారాయణ సహకారంతో డాక్టర్ సుమన్ నేతృత్వంలోని దివ్యాంగ సంఘాల నాయకులు తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దివ్యాంగులను వైకల్యం పేరుతో అవమానించడం, వారిపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలపై పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రితో జరిగే ప్రత్యేక సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి, చట్టం అమలుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు డాక్టర్ సుమన్ వెల్లడించారు.

దివ్యాంగుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపాలని దివ్యాంగ సంఘాల నాయకులు కోరారు.

## క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత



రుద్రూర్, అక్టోబర్ 21 (మనం న్యూస్) : దసరా సెలవుల సందర్భంగా రుద్రూర్ మండలం అంబం(ఆర్) గ్రామంలోని శ్రీ ఆంజనేయ గోశాలలో బుధవారం విద్యార్థులకు బ్యాట్మెంటన్ (షటిల్), క్యారం బోర్డ్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగు, డస్టర్ గేమ్స్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. దేవి శోభాయాత్ర సందర్భంగా క్రీడా పోటీలో గెలుపొందిన విద్యార్థులకు, యువకులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్లేపు గంగాధర్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం: పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

## అమరవీరుల కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక సదస్సు








నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 21 (మనం న్యూస్): విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్లోని కమాండ్ కంట్రోల్ హాలులో 21 మంది అమరవీరుల కుటుంబ సభ్యులతో సంక్షేమ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ సాయంపై సమీక్షించారు. ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకుని, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అమరవీరుల కుటుంబాల సంక్షేమాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖకు తెలియజేయాలని, కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు బి. ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, కార్యాలయ సూపరింటెండెంట్లు శంకర్, ఎ. జగతి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీను, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# బస్వాపూర్లో మన్నె కులం రాష్ట్ర కమిటీ సమావేశం

## నీట్లో ఎంబీబీఎస్ సీటు సాధించిన మాసుల సహస్రకు ఘన సన్మానం

భిక్కనూర్, అక్టోబర్ 21 ( మనం న్యూస్ ) : భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామంలోని హోటల్ 44లో మన్నె కులం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన మాసుల బాలరాజు, వినోద దంపతుల కుమార్తె మాసుల సహస్ర ఇటీవల నీట్ పరీక్షలో అర్హత సాధించి ఎంబీబీఎస్ సీటు పొందిన సందర్భంగా ఈ సమావేశం నిర్వహించారు.

సహస్ర కులానికి సంబంధించి ఎస్సీ వర్గంలో మన్నె కులానికి చెందిన వారు కాదంటూ కొందరు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె మన్నె కులానికి చెందిన వారేనని స్పష్టం చేసేందుకు రాష్ట్ర కమిటీ నాయకులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సహస్రను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో మన్నె కులం రాష్ట్ర అధ్యక్షుడు మన్నె సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి శివోళ్ల బాబు, ఉపాధ్యక్షులు క్యాత బాలయ్య, డి. నాగభూషణం, మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు సురేష్, సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు అంకమొళ్ల వెంకటి, రాష్ట్ర నాయకులు రవి, పాపయ్య, అశోక్, యాదగిరి, సాయిబాబు, అరుణ్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

అలాగే బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎల్లం, భిక్షపతి, స్వప్నకృష్ణతో పాటు సహస్ర తల్లిదండ్రులు బాలరాజు, వినోద హాజరయ్యారు. బస్వాపూర్ గ్రామ మన్నె కులం అధ్యక్షుడు మాసుల భిక్షపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నీట్లో ఎంబీబీఎస్ సీటు సాధించి గ్రామానికి, కుటుంబానికి పేరు తీసుకొచ్చిన సహస్రను పలువురు అభినందించారు.

# అన్నదాతల ఆత్మీయ కలయిక.. అలాయ్ బలాయ్ సందడి

## సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించాలి - సుంకేట అన్వేష్ రెడ్డి





ఆర్మూర్, అక్టోబర్ 21 (మనం న్యూస్): ఆర్మూర్ పట్టణంలోని కామాక్షి కన్వెన్షన్ హాల్లో అన్నదాతల ఆత్మీయ కలయిక 'అలాయ్ బలాయ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్, విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం దసరా అనంతరం రైతుల మధ్య ఆత్మీయతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సుంకేట అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయనాల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేలా నాణ్యమైన పంటలు సాగు చేయాలని, రైతులు పండించే పంటలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించేలా కృషి చేయాలని అన్నారు. 'అన్నం పెట్టే రైతే రాజు.. జై జవాన్.. జై కిసాన్' అనే నినాదంతో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ వ్యవసాయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ ఇన్చార్జి సునీల్ రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, ఆల్ ఇండియా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, దేవరం, అడ్వకేట్ గంగన్న తదితరులు పాల్గొన్నారు. రైతుల ఆత్మీయ కలయికతో కార్యక్రమం సందడిగా సాగింది.



# దుర్గామాత నిమజ్జనంలో చైర్‌పర్సన్ ఉమారాణి

**- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**

**- కామారెడ్డి అభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన.**

**- ఉత్సవ కమిటీ సభ్యులకు చైర్పర్సన్ అభినందనలు.**



కామారెడ్డి, అక్టోబరు 21 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గామాత నిమజ్జన కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని దుర్గామాతను ప్రార్థించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, సమాజంలో ఐకమత్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

**శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ**

శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించిన శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ సభ్యులను చైర్పర్సన్ ప్రత్యేకంగా అభినందించారు. నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు దోహదపడతాయని అన్నారు. ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి ఆకాంక్షిస్తూ అమ్మవారిని ప్రార్థించిన చైర్పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ నిమజ్జన కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సుధీర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణు, సుజని, సునీత, సవిత, శ్రేయ, లక్ష్మి, అక్షయ్, నాగరాజు, ప్రశాంత్‌తో పాటు వైద్యనాథ్ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## దుర్గామాత నిమజ్జన ఊరేగింపును పర్యవేక్షించిన పోలీసులు



భిక్కనూర్, అక్టోబర్ 21 ( మనం న్యూస్ ): భిక్కనూర్ మండలంలోని దుర్గామాత నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలను మండల సీఐ నరేష్, ఎస్సై అనిల్ పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఊరేగింపుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును పర్యవేక్షిస్తూ, భక్తులు సురక్షితంగా నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు చేపడుతున్నారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

# కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆత్మీయ భేటీ

**దసరా వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు**



నిజామాబాద్ రూరల్ , అక్టోబర్ 21 (మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని డిచ్పల్లి మండలం వెస్లీ నగర్ తండాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబర్ సింగ్ నివాసంలో నిర్వహించిన ఆత్మీయ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించారు. పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొని నాయకులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అంబర్ సింగ్ తన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యేకు పరిచయం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చౌహాన్ విజయ్, మాజీ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాయరెడ్డి, పోలసాని శ్రీనివాస్, అమృతాపూర్ గంగాధర్, తారాచంద్ నాయక్, హన్మండ్లు, రాంచందర్ గౌడ్, షాదుల్లా, సురేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







## నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల అందజేత...

రుద్రూర్, అక్టోబర్ 21 (మనం న్యూస్) : రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో 10 నిరుపేద కుటుంబాలకు కీ.శే ఇందూరు జగన్ మోహన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. జగన్ మోహన్ కుమారులు ఇందూరు శ్రీధర్, శ్రీకాంత్ ల సహకారంతో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సేవ దృక్పథంతో ప్రతి ఒక్కరు ఉండాలని ఇందూరు శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గగన్ యాదవ్, గౌతమ్, తాహెర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా దసరా ఉత్సవాలు



బీబీపేట,అక్టోబర్ 21(మనం న్యూస్): బీబీపేట మండల కేంద్రం తో పాటు ఆయా గ్రామాలలో దసరా పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు కొత్త బట్టలు ధరించి పాలపిట్ట దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం ఒకరి ఒకరు జాంబీ ఆకును పంచుకొని ఆలయే బాలయీ ఇచ్చుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాచీన బురుజు ను త్రివర్ణ పతాకం వర్ణపు రంగులను అద్దారు.బురుజు పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. నవరాత్రుల పూజలు అందుకున్న దుర్గమాత నిమజ్జన కార్యక్రమన్ని భవానీ మాలధారణ స్వాములు, మండప నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, డీజే చప్పులతో అమ్మవారి నిమజ్జన కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాధ్విక, సాయినాథ్ ఉప సర్పంచ్ చందుపట్ల ప్రశాంత్ కుమార్, సొసైటీ చైర్మన్ సుతారీ రమేష్, గ్రామ ప్రజలు, దుర్గా మాత మండప నిర్వహకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.